పేదలకు కంటి చూపే బీసీఎం లక్ష్యం

- ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ రాజలింగం

కొదురుపాక బీసీఎం కంటి దవాఖానలో కంటి ఆపరేషన్ చేసుకున్న వారితో కంటి వైద్య నిపుణుడు డాక్టర్ రాజలింగం

బోయినపల్లి, ఆగస్టు 25: కంటి సమస్యలున్న ప్రతి పేదకు కంటి చూపును ఇవ్వడమే బీసీఎం లక్ష్యం అని ఆ కంటి దవాఖాన లక్ష్యం అని బీసీఎం వ్యవస్థాపకులు ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ రాజలింగం చెప్పారు. బీసీఎం కంటి దవాఖాన ఏర్పాటు చేసిన ఏడాదిన్నర కాలంలో ఇప్పటివరకు 1,338 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేసినట్లు ఆయన తెలిపారు. శనివారం బీసీఎం కంటి దవాఖానలో 31 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేశారు. ఆదివారం వారందరికీ మళ్లీ కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదవారు ఈ బీసీఎం కంటి దవాఖాన సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నెలలో రెండు సార్లు ఉచిత కంటి ఆపరేషన్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణురాలు రీటా బహదూర్‌షా, మాజీ ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, బీఆర్ఎస్ చొప్పదండి మండల నాయకులు మాచర్ల వినయ్‌లున్నారు.

మోషయ్య అభివృద్ధికి ఆస్తులమ్మున్నడు

- దుమాల మాజీ సర్పంచులు
- అనారోగ్యంతో నిమ్స్‌లో మృతి
- ఎమ్మెల్యే కేటీఆర్ చొరవతో మృతదేహం తరలింపు

మోషయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 25: అభ్యుదయ భావజాలం మధ్య పెరిగిన దుమాల రామిండ్ల వాడలో పెరిగిన రామిండ్ల మోషయ్య ఏకగ్రీవంగా సర్పంచ్ అయి గ్రామాభివృద్ధి కోసం ఆస్తులమ్ముకున్నట్లు మాజీ సర్పంచ్‌లు కదిరె శ్రీనివాస్, గుల్లపల్లి నర్సింహారెడ్డి తెలిపారు. ఆదివారం గ్రామ పంచాయతీ ఆవరణలో మోషయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కొద్దిరోజులుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, ఇటీవల హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో ఆపరేషన్ జరిగింది. గ్రామస్తులు ఆయన చికిత్స కోసం చందాలు వేసుకొని రూ.47వేలు అందించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందగా హాస్పిటల్ బిల్లు చెల్లించే క్రమంలో చేతిలో డబ్బులు లేకపోవడంతో హాస్పిటల్ సిబ్బంది మృతదేహాన్ని ఇచ్చేందుకు నిరాకరించారు. సమస్యను తెలుసుకుని మాజీ వైస్ ఎంపీపీ కదిరె భాస్కర్ ఎమ్మెల్యే కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని మృతదేహాన్ని దుమాలకు తరలించారు. ఆదివారం గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అంత్యక్రియలు చేశారు

పంచాయతీ ఆవరణలో మోషయ్యకు నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

జిల్లాలో మోస్తరు వర్షం

రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. అన్ని మండలాల్లో చిరుజల్లులు పడగా, జిల్లా కేంద్రంతోపాటు ముస్తాబాద్ మండలం గూడెం, ఆవునూరు, వెంకటాపూర్ గ్రామాలో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి జిల్లాలో అక్కడక్కడా చిరుజల్లులు పడ్డాయి. సాయంత్రం ఐదు గంటలకు ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. పది నిమిషాల్లో ఒక్కసారిగా కుమ్మరించిన వర్షంతో రోడ్లపై వర్షపు నీరు చేరింది.



మంగళ్లపల్లిలో పత్తిచేనులో నిలిచిన నీరు

పత్తి రైతుకు కష్టకాలం

- వానలతో పంట చేలలో నీళ్లు
- పత్తి పంటకు సోకుతున్న తెగుళ్లు
- ఎర్రబారుతున్న మొక్కలు
- నిలిచిపోయిన పంట ఎదుగుదల
- ఆందోళనలో రైతన్నలు

వానకాలం ఆరంభంలో వర్షాలు ముందస్తుగా కురిసి మురిపించాయి. దీంతో రైతులు సంతోషంలో పత్తి విత్తనాలు విత్తడంతో ఆశాజనకంగా మొలకెత్తాయి. రైతులు పంట చేనులో కలుపు మొక్కలను కూలీలు, యంత్రాల సాయంతో తొలగించి వర్షం కోసం ఎదురుచూశారు. కానీ నెలరోజుల పాటు వర్షాలు ముఖం చాటేశాయి. ఈ క్రమంలో వాతావరణ మార్పులతో ముసురుతోపాటు సమృద్ధిగా వర్షాలు పడడంతో పత్తి రైతుల ఆశలు ఆవిరయ్యాయి.

- కోనరావుపేట, ఆగస్టు 25

ఎడతెరిపి లేకుండా కురిసిన ముసురు వర్షాలతో పత్తిసాగు చేసిన రైతుకు పెట్టుబడి భారం రెట్టింపవుతోంది. ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా పడి పంటలు బాగా పండుతాయని అనుకున్నారు. దీంతో పత్తి పంట ముందే సాగుచేసి రైతులు వర్షాల కోసం ఎదురుచూశారు. పత్తి పంటకు అనుకూలంగా వానపడడంతో ఆనందం వ్యక్తం చేశారు. కానీ వాతావరణ పరిస్థితులు మారి ఎడతెరిపి లేకుండా కురిసిన వానతో పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. వారం నుంచి పదిరోజుల పాటు రోజంతా ముసురు పడడంతో పత్తి చేనులో నీరు నిలిచిపోయింది. దీంతో పత్తి మొక్కలు ఎర్రబారుతుండడంతోపాటు ఎదుగుదల నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు దుక్కులు దున్నడం మొదలు ఎరువులు, విత్తనాలు, కలుపు మొక్కలు నివారించడంలో ముందస్తు చర్యలు తీసుకున్న లాభం లేకుండా పోయింది. ఇప్పటికే ఒక్కో ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు పెట్టుబడి పెట్టారు. ఒకవైపు పెట్టుబడులు పెరగడంతో పాటు మరోవైపు పంట దిగుబడిపై ప్రభావం చూపోతుందని ఆవేదన చెందుతున్నారు.

పత్తిలో తెగుళ్లు

పంటలు ఎదుగుతున్న క్రమంలో వర్షం వారం రోజులు కురియడంతో పత్తి పంటలో తెగుళ్ల బెడద ఎక్కువైంది. ఇప్పటికే పత్తి మొక్కల్లో నీరు నిలిచి ఎర్రబారి పోవడం, మరో వైపు చీడపురుగులు వ్యాప్తి చెందుతున్నాయి. అలాగే పత్తిలో కలుపు మొక్కలు పెరుగుతున్నాయి. దీంతో రైతులు కలుపు తీయకుండా గడ్డి మందులు పిచికారీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఇలానే వర్షం కురిస్తే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. దీంతో రసాయనిక ఎరువులు వేయడం, పిచికారీ చేయడం వంటి పనులు ముందుకు సాగడం లేదు. అలాగే పత్తి చేనులో కలుపు మొక్కల నివారణకు అధిక మొత్తంలో గడ్డి మందు పిచికారి చేస్తున్నారు. దీంతో పంట చేలకు రక్షణకు కల్పించే కీటకాలు అంతరించి పోతున్నాయి.

జిల్లాలో సాగు వివరాలిలా..

ఈ ఏడాది వానకాలంలో జిల్లా వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం 46,548 ఎకరాల్లో పత్తి పంటను సాగుచేయగా, 1.18లక్షల ఎకరాలో వరి పంటను సాగుచేయనున్నారు. దీంతో వర్షం ఎక్కువ మోతాదులో కురియకపోవడంతో వరి పంటకు నష్టం వాటిల్లడంతో పాటు ముసురు వానకురియడంతో పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

వానతో తీవ్రనష్టం వాటిల్లింది

నాకున్న ఐదు ఎకరాల భూమితో పాటు మరో మూడు ఎకరాలు కౌలు తీసుకుని పత్తి పంట సాగు చేశాను. ఆరంభంలో పత్తి ఆశించిన స్థాయిలో మొలకెత్తింది. కానీ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పత్తిపంటలో నీరు నిల్వడంతో పాటుగా గడ్డి, పిచ్చి మొక్కులు ఎదుగుతున్నాయి. దీంతో భూమి తడిగా ఉండడంతో కలుపు మొక్కలు నివారణ చేయలేకపోతున్నాం. గడ్డి మందు పిచికారీ చేస్తే ఈసారి మరింతగా పెట్టుబడి భారం పెరగనుంది. దీంతో ముసురు వానతో తీవ్రనష్టం వాటిల్లింది.

-వట్టిమల్ల రవి, రైతు, మూడపల్లి(చందుర్తి)

పదెకరాలు పంట వేసిన

ఈఏడాది తొలకరి ముందుగా పలకరించడంతో నాకున్న 4 ఎకరాల భూమితో పాటు మరో ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని పత్తి పంట వేసిన. దుక్కి దున్ని మొదలు, ఎరువులు, కూలీలకు ఒక్కో ఎకరానికి రూ.10వేల నుంచి 12వేల వరకు పెట్టుబడి పెట్టిన. ముసురు వానతో పత్తిలో గడ్డి, కలుపు మొక్కలు ఏపుగా పెరిగినయ్. నీరు నిలిచినచోట మొక్కలు ఎర్రబారిపోయాయి. ఇప్పుడున్న పంటను చూస్తే ఈసారి పెట్టుబడి వస్తదో, రాదో అని దిగాలుగా ఉంది.

-కొమిరెడ్డి నాగరాజు, రైతు, (మంగళ్లపల్లి)

రైతులు నివారణ చర్యలు చేపట్టాలి

అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పత్తి పంట వేసిన రైతులు నివారణ చర్యలు చేపట్టాలి. పంట చేనులో నిలిచిన నీరు తీసేవేసే విధంగా చూడాలి. వర్షాలతో భూమిలో తేమ శాతం అధికంగా ఉండడం వల్ల పత్తి మొక్కలు ఎర్రబారి ఎదుగుదల నిలిచిపోతుంది. దీంతో పత్తి పంటలో నిలిచిన వర్షపు నీరు ఎప్పటికప్పుడు తొలగించాలి. జాగ్రత్తలు పాటించినప్పుడే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది. క్లస్టర్ పరిధిలోని వ్యవసాయావిస్తరణాధికారులకు పంట తీరును వివరిస్తూ వారి సూచనలు, సలహాలు పాటించాలి.

- రామారావు, ఏడీఏ(వేములవాడ)

జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఎన్నిక

నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 25: జిల్లా వాలీబాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెన్నమనేని శ్రీకుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆజ్మీరా రాందాస్, కోశాధికారిగా కడెం శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా లక్ష్మీనారాయణ, శ్యాంకుమార్, ప్రసాద్‌రావు, వేణు, రఫీ, మహేశ్, కోల శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, సంఘ స్వామితోపాటు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



సిరిసిల్ల టౌన్ : కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ చంద్రకళ

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 25: జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం, దర్శన హారతి, హరినామ జప యజ్ఞం, రాజాభోగ హారతి, తదితర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఘనంగా ఏరాట్లు చేసినట్లు ఇస్కాన్ నిర్వాహకులు తెలిపారు. జన్మదిన వేడుకలకు పట్టణ ప్రజలు, భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు.

నేడు ఇస్కాన్ ఆలయంలో వేడుకలు

వేములవాడ రూరల్, ఆగస్టు 25: వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న ఇస్కాన్ ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు నేడు ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉదయం మంగళహారతి, దర్శన హారతి, హరినామ సంకీర్తన, సాయంత్రం మహాభిషేకం, శ్రీ కృష్ణ లీలా ప్రవచనం, చప్పన్‌భోగ్ హారతి ఉంటాయన్నారు. భక్తులు కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొనాలని ఇస్కాన్ ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

రాజన్న ఆలయంలో శ్రావణ సందడి

- స్వామివారి సన్నిధిలో 40 వేలకు పైగా భక్తులు

ఆలయం ముందు భాగంలో భక్తులు

వేములవాడ టౌన్, ఆగస్టు 25 : శ్రావణమాసం అందులో సెలవు దినం ఆదివారం కావడంతో వేములవాడ రాజన్న క్షేత్రం భక్తులతో రద్దీగా కనిపించింది. సుమారు 40 వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రద్దీ దృష్ట్యా అధికారులు ఆర్జిత సేవలు రద్దు చేశారు. ఆలయంలో భక్తులు క్యూలో వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఉచిత ,శీఘ్ర దర్శన క్యూలో భక్తులు నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకున్నారు. వివిధ ఆర్జితసేవల ద్వారా రాజన్నకు దాదాపు రూ.24 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

కోడెమొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE

★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.

NT- 326217

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

యువతకు మంచి రోజులు రానున్నాయి

- పుట్టినరోజున కేటీఆర్‌ను కలిసిన అభిమాని మనోహర్

మెంగని మనోహర్‌ను ఆశీర్వదిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ముస్తాబాద్, ఆగస్టు 25 : మండల కేంద్రంలోని కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ పుట్టిన రోజును పురస్కరించుకొని తన కుమారుడితో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను హైదరాబాద్‌లో కలిసి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా రానున్న రోజుల్లో పార్టీ శ్రేణులకు మంచి రోజులు రానున్నాయని కేటీఆర్ తెలిపారని మనోహర్ అన్నారు. కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందని, పార్టీకి పూర్వ వైభవం యువతతోనే సాధ్యమని వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారని తెలిపారు. ఇక్కడ శీలం స్వామి ఉన్నారు.

అంబేద్కర్ ఆదర్శప్రాయుడు

- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ
- కందికట్కూర్‌లో అంబేద్కర్ కాంస విగ్రహావిష్కరణ

అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట, ఆగస్టు 25 : అంబేద్కర్ ఆదర్శ ప్రాయుడని.. నేటి యువత ఆయన అడుగు జాడల్లో నడవాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని కందికట్కూర్ గ్రామంలో అంబేద్కర్ సంఘ భవనానికి శిలాఫలకంతోపాటు కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అంబేద్కర్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆహార భద్రతా కమిటీ సభ్యుడు ఓరుగంటి ఆనంద్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, నాయకులు సుదర్శన్, కొమ్ము రమేశ్, పసుల వెంకటి, భూమయ్య, కృష్ణ, రాకేశ్, మాజీ ఎంపీపీలు గుడిసె ఐలయ్య, దామోదర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాఘవ రెడ్డి, మాజీ సర్పంచ్ ముత్యం అమర్, మాజీ ఎంపీటీసీ యాస తిరుపతి, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

రుద్రంగి, ఆగస్టు 25: రుద్రంగి మండల కేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని గ్రామస్తులు వాపోతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా రోజూ మైనర్ డ్రైవర్లతో ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారని తెలిపారు. నందివాగు, కోచ్చగుట్టతండా, దుర్గమ్మ ఆలయ ఆవరణలోని వాగులో ఇసుకను తరలించడంతో భారీగా గుంతలు ఏర్పడటంతో వ్యవసాయ భూములు కోతకు గురవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను నియంత్రించాలని స్థానిక రైతులు, ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎస్ఐ అశోక్‌ను వివరణ కోరగా అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మద్యం తాగి విధులకు హాజరైన రాజన్న ఆలయ వంటశాల ఉద్యోగి

- సస్పెండ్ చేసిన ఈవో

వేములవాడ టౌన్, ఆగస్టు 25 : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయంలో వంట చేసే ఉద్యోగి సంతోష్‌ను ఆదివారం సస్పెండ్ చేసినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. మూడు రోజుల క్రితం ఆలయ వంట గదిలో ఈ ఉద్యోగి మద్యం తాగి విధులు నిర్వర్తించడమే కాకుండా స్వామివారి నివేదనను సమయానికి అందించలేదని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినందున ఈ వంట మనిషిని సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణ చౌక్, ఆగస్టు 25: సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలు చూసి మోసపోవద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారం రోజుల్లో జిల్లాలో జరిగిన సైబర్ నేరాల వివరాలను వెల్లడించారు. సైబర్ నేరగాళ్లు ఆశ, భయం చూపి నేరాలకు పాల్పడుతున్నారని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. లోన్ యాప్, లాటరీ, పార్ట్‌టైమ్ జాబ్, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం, పింక్ వాట్సాప్ పేరుతో మెసేజ్‌లు రాగానే ఆశపడి మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మొబైల్ వాడేటప్పుడు మీ ప్రమేయం లేకుండా ఓటీపీ వస్తే ఎవరికీ చెప్పవద్దని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాలు, సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం అందుబాటులో ఉంచకూడదని పేర్కొన్నారు. ఏదైనా సైబర్ క్రైమ్ జరిగితే వెంటనే 1930కి కాల్ చేస్తే పోగొట్టుకున్న డబ్బులు తిరిగి పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శిని అగౌరవ పరచడం సరికాదు

ఇల్లంతకుంట, ఆగస్టు 25 : పంచాయతీ కార్యదర్శిని అగౌరవ పరచడం సరికాదని మాజీ సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు చల్ల నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ సర్పంచులు తమ బిల్లులపై ఎంపీడీవో కార్యాలయానికి వచ్చే కనీస మర్యాద కూడా ఇవ్వడం లేదన్నారు. ఎంపీవో, ఎంపీడీవోల ప్రవర్తన వల్ల మండల కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. కిందిస్థాయి ఉద్యోగలపై వారి ప్రవర్తన మారకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

కాంస్య విగ్రహ ఏర్పాటు కృషి రసమయిదే

- బీఆర్ఎస్ దళిత సంఘం మండలాధ్యక్షుడు బాబు

ఇల్లంతకుంట, ఆగస్టు 25 : మండలంలోని కందికట్కూర్ గ్రామంలో అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ కృషేనని మండల బీఆర్ఎస్ దళిత సంఘం అధ్యక్షుడు పసుల బాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పొత్తూరు, కందికట్కూర్ గ్రామాల్లోని అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటుకు మాజీ ఎమ్మెల్యే అన్ని ఏర్పాట్లు చేశారని, పొత్తూరులో ఘనంగా ఆవిష్కరించుకోవడం జరిగిందని పేర్కొన్నారు. కందికట్కూర్‌లో అందరినీ సమన్వయం చేసి కాంస్య విగ్రహంతోపాటు పాలరాతి కట్టడం ఆకర్షణీయంగా ఏర్పాటు చేయించి ప్రారంభించుకోవడానికి ఎన్నికల కోడు ఉండడంతో ఆగిపోయిందన్నారు. ఇంత కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ రాకుండా చేసి ప్రారంభించుకోవడం కాంగ్రెస్ నాయకులకే చెల్లిందన్నారు.

వృద్ధులకు చేతుల కర్రల అందజేత

వేములవాడ రూరల్, ఆగస్టు 25: వేములవాడ రూరల్ మండలం నాగయ్యపల్లి గ్రామంలోని వృద్ధులకు కాంగ్రెస్ నాయకులు రొండి రాజు చేతి కర్రలు అందజేశారు. ప్రభుత్వం తరపున వచ్చిన కర్రలను ప్రభుత్వానికి అందజేశామని రాజు అన్నారు. ఇక్కడ కాంగ్రెస్ నాయకులున్నారు.

కానిస్టేబుల్‌కు హరీశ్‌రావు పరామర్శ

కానిస్టేబుల్ సత్యనారాయణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

ముస్తాబాద్, ఆగస్టు 25 : సికింద్రాబాద్ యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ బైరి సత్యనారాయణను ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదివారం పరామర్శించారు. ముస్తాబాద్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసిన బైరి సత్యనారాయణ జూన్ 25న విధినిర్వహణలో ట్రాక్టర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి యశోద దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. కాగా, కానిస్టేబుల్‌ను ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించి, కుటుంబ సభ్యులతో మాట్లాడి మనోధైర్యాన్నిచ్చారు.

యువత అవకాశాలను అందిపుచ్చుకుని ఎదగాలి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో వేములవాడలో జాబ్‌మేళా నిర్వహణ

జాబ్ మేళాలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఆగస్టు 25 : యువత వచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచించారు. జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలోని మహా లింగేశ్వర గార్డెన్‌లో ఆదివారం మెగా జాబ్‌మేళా నిర్వహించగా, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జాబ్‌మేళాకు జిల్లాతోపాటు వివిధ జిల్లాలకు చెందిన దాదాపు 48 ప్రైవేటు కంపెనీలు వచ్చాయి. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది నెలల్లో 30 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని వెల్లడించారు. యువత వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎదగాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత, తల్లిదండ్రులు భాగస్వామ్యులు కావాలని కోరారు. ఇక్కడ 800 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు జిల్లా ఉపాధి అధికారి రాఘవేందర్ తెలిపారు. కార్యాలయంలో వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్, ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్, తహసీల్దార్ మహేశ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ తదితరులున్నారు.

గణేశ్ నవరాత్రోత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి
- డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి
- వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 25: రాబోయే గణేశ్ నవరాత్రోత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని, మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఆదివారం స్థానిక మార్కండేయ ఆలయంలో మండలంలోని గ్రామాల్లోని వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినాయక మండప నిర్వాహకులు నిబంధనలు పాటించి, పోలీసుశాఖకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, ఎస్ఐ సుధాకర్, పోలీసు సిబ్బంది, మండప నిర్వాహకులున్నారు.